క్లుప్తంగా

బీమా చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న డీసీసీబీ సీఈఓ ఉమామహేశ్వరరావు

గుర్ల: మండలంలోని గూడెం పీఏసీఎస్‌లో ఖాతాదారులు పున్నపురెడ్డిపేట, నక్కలపేటకు చెందిన పున్నపురెడ్డి కనకంనాయుడు, అల్లూరి రామకృష్ణరాజు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలకు రూ.2లక్షలు చొప్పున బీమా మంజూరైంది.సంబంధిత చెక్కులను డీసీసీబీ సీఈఓ సీహెచ్.ఉమామహేశ్వరరావు గూడెం పీఏసీఎస్‌లో బుధవారం అందజేశారు. డీసీసీబీ డీజీఎం ప్రసాద్, గుర్ల డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ హరికేశవరావు, గూడెం పీఏసీఎస్ సీఈఓ శీర స్వామి పాల్గొన్నారు.

భూఆధార్ తప్పనిసరి



గుర్ల: కెల్ల రైతు సేవా కేంద్రంలో భూఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీ వి.టి.రామారావు

గుర్ల/చీపురుపల్లిరూరల్(గరివిడి): రైతులకు భూఆధార్ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి(జేడీ) వి.టి.రామారావు అన్నారు. భూఆ ధార్ కార్డుల కోసం గుర్ల మండలంలోని కెల్ల గ్రామం, గరివిడి మండలంలోని దువ్వాం గ్రామ రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలు చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఈనెల 10వ తేదీలోగా భూఆధార్ నమోదును పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించా రు. రైతులతో ఆయన మాట్లాడుతూ భూఆధార్ కార్డు ఉన్న రైతులకే ప్రభుత్వం నుంచి వ్యవసాయ సంబంధిత పథకాలు, ప్రోత్సాహకాలు, రాయితీ లు, వ్యవసాయ పరికరాలు, సాగుపెట్టుబడి సాయం అందుతుందని చెప్పారు. ఆయన వెంట ఏడీ ఎస్.కోటేశ్వరరావు, గుర్ల, గరివిడి ఏఓలు తిరుపతిరావు, వి.శైలజ ఉన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన



కంటకాపల్లిల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సాహిల్‌రాజు

కొత్తవలస: మామిడి పంటలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై బలిఘట్టాం,కంటకాపల్లి, చిన్నరా వుపల్లి గ్రామాల్లో రైతులకు హెచ్‌ఓ పప్పు పద్మ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త జి.సాహిల్ రాజు మామిడిని ఆశించే చీడపీడ లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సచివాలయ హార్టికల్చర్ సహాయ కులు అయ్యప్ప, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాలవలస సర్పంచ్ మృతి



పొట్నూరు కనకమ్మ (ఫైల్)

గుర్ల: సతివాడ మాజీ ఎమ్మెల్యే దివంగత పొట్నూరు సూర్యనారాయణ భార్య పాలవలస సర్పంచ్ పొట్నూ రు కనకమ్మ(76) అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బుధవారం మృతి చెందారు.ఈమె కుమారుడు సన్యాసినాయు డు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు, కోడలు ప్రమీల ఎంపీ పీ పదవిలో ఉన్నారు.కనకమ్మ మృతిపై శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపా రు.

ఆటోడ్రైవర్లకు దక్కని భరోసా..!



- ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15వేలు సాయం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి
- సంక్షేమ బోర్డు ఏర్పాటు ఊసే లేదు
- తాజా బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించని వైనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేల సాయం
- 2019 నుంచి 2023 వరకు గంట్యాడ మండలంలోని 2,583 మంది లబ్ధిదారులకు అందిన సాయం రూ.కోటి

గంట్యాడ: ఎన్నికలకు ముందు ఒక మాట... తర్వాత మరో మాట చెప్పడం, అన్నివర్గాలకు ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, అధికారం వచ్చిన తర్వాత వాటిని అటకెక్కించడం టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడుకి పరిపాటిగా మారింది. ప్రజలను పదేపదే మోసం చేయడంలో తనకు తానే సాటి అని ప్రతీసారి నిరూపించుకుంటున్నారు. 2014లో ఆరు వందలకు పైచిలుకు హామీలు ఇచ్చి, మాయమాటలు చెప్పి అధికా రంలోకి వచ్చారు. 2024లోనూ అదే రీతిలో హామీ లు ఇచ్చి తనదైన తీరులో ఎగనామం పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు. కూటమి అధికా రంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, ఆరోగ్యబీమా, డ్రైవర్ల పిల్లలకు విద్యారుణాలు, తదితర హామీలను మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచిపోతున్నా వీటిలో ఏ హామీ కార్య రూపం దాల్చలేదు. తాజాగా ప్రవే శపెట్టిన 2025–26 వార్షిక బడ్జెట్‌లో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం పథకానికి రూపాయి కూడా కేటాయించ లేదు. సంక్షేమ బోర్డు, ఇతర హామీలను పరిగణనలోకే తీసుకోలేదు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సహాయం ఇవ్వాల్సిందేనని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సాయం అందించక పోగా అధికారంలోకి వచ్చిన రోజు నుంచే రకరకాల పేర్లతో అపరాధ రుసుములు విధిస్తూ తమపై బాదుడు మొదలు పెట్టారని ఆటో కార్మికులు మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో రూ.50 వేలు అందింది



జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున సాయం అందించారు. అయిదేళ్లలో రూ.50 వేలు అందుకున్నాను. ఈ డబ్బులు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మరమ్మతులకు ఉపయోగపడేవి. ప్రస్తుత ప్రభుత్వంలో మాకు ఎలాంటి సాయం అందలేదు.

– రాయవరపు సన్యాసిరావు, ఆటోడ్రైవర్, గంట్యాడ మండలం

చెప్పిన తేదీకి ఇచ్చేసేవారు



గత ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ద్వారా చెప్పిన తేదీకి రూ.10 వేలు ఇచ్చేసే వారు. కేవలం ఆటో నడుపుకుంటూ వచ్చే ఆదాయం ద్వారానే కుటుంబాన్ని పోషించుకుంటున్న మాకు ఈ డబ్బులు ఎంతగానో ఉపయోగపడేవి. కూటమి అధికారంలోకా వస్తే రూ.15 వేలు ఇస్తామన్నారు. మాకు ఇంకా ప్రభుత్వం నుంచి సాయం అందలేదు.

– పి.పోలినాయుడు, ఆటో డ్రైవర్, గంట్యాడ మండలం

మాట నిలబెట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డి

2019కు ముందు ప్రతిపక్ష నేతగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆయన్ని ఆటో డ్రైవర్లు కలిసి తమసమస్యలను చెప్పుకున్నారు. తాము అధికారంలోకి వస్తే సొంతంగా ఆటో ఉన్నవారితో పాటు ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు ఇస్తామని ఆయన మాట ఇచ్చారు. 2019లో అధికారం లోకి వచ్చిన వెంటనే వాహనమిత్ర పథకం పేరిట రూ.10 వేల ఆర్థిక సాయం అందించా రు. అయిదేళ్ల పాటు ఏటా ఈ ఆర్థికసాయం అందిస్తూ వచ్చారు.ఈ డబ్బులను ఆటో మరమ్మతులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి వాటి కోసం ఉపయోగించుకునేవారు. గంట్యాడ మండలంలో వాహన మిత్ర పథకం ద్వారా 2019 నుంచి 2023 వరకు 2,583 మంది లబ్ధిదారులకు రూ. కోటి సాయాన్ని అందించారు.

రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



లక్కవరపుకోట: నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

లక్కవరపుకోట/శృంగవరపుకోట: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ కోరారు. ఎల్.కోట మండలంలోని సంతపేట జంక్షన్ వద్ద గల దుర్గమాంబ ఆటోస్టాండ్ ఆటో కార్మికులు, ఎస్.కోట, జామి మండల కేంద్రాల్లోని ఆటో కార్మికులు బుధవారం సీఐటీయూలోకి చేరారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకై సీఐటీయూ నిరంతర పోరాటం చేస్తోందన్నారు. ప్రతీ కార్మికుడి శ్రమ వెనుక దేశ ప్రయోజనాలు దాగి ఉన్నాయన్నారు. మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేస్తూ రవాణా కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్‌కు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. దుర్గమాంబ ఆటోయూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణ, అప్పారావు, సీఐటీయూ నాయకులు మద్దిల రమణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చీపురుపల్లి: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని రిటైర్డ్ జిల్లా పరిషత్ విద్యాధికారి కె.ఆనంద్ సాగర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1969లో ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆ పాఠశాల వేదికగా బుధవారం జరిగింది. అరవై సంవత్సరాల క్రితం పాఠశాలను విడిచి తిరిగి ఇప్పుడు కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. వివిధ హోదాల్లో పదవీ విరమణ పొందిన పూర్వ విద్యార్థులు ఇప్పిలి నీలకంఠం, ఎంవి.ఎస్.ఎన్.రాజు, ఎం.సూరప్పడు, యు.రాంబాబు, పి.మోహనరావు, సూరు చిట్టి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ రవిప్రసాద్

గజపతినగరం: వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువని, అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక అధికారి ఎం.ఎస్.వి. రవిప్రసాద్ సూచించారు. స్థానిక బెల్లాన కన్వెన్షన్ ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. వంట చేసేటప్పుడు గ్యాస్ లీక్ అవ్వడం ద్వారా వ్యాపించే మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. విద్యుత్ వైరింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. క్యాంపులు వెళ్లే సమయంలో ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ తప్పనిసరిగా ఆఫ్ చేయాలని సూచించారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు 101 లేదా 285277 నంబర్‌లకు ఫోన్ చేయాలని చెప్పారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు బెల్లాన కన్వెన్షన్ ఓనర్ బెల్లాన లక్ష్మీనరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో సత్తా



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ విశ్వనాథం

కొత్తవలస: గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఒలింపియాడ్‌లో అప్పన్నపాలెం గ్రామ సమీపంలో ఉన్న ఓపీ జిందాల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ పి.వి.ఎస్.ఎస్.విశ్వనాథం బుధవారం సర్టిఫికెట్‌లు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఒలింపియాడ్ ఫలితాలు తాజాగా వెల్లడయ్యాయని చెప్పారు. ఈ పోటీలకు పాఠశాల నుంచి 160 మంది విద్యార్థులు హాజరుకాగా 18 మందికి బంగారు పతకాలు వచ్చాయని తెలిపారు.

కిచెన్ గార్డెన్స్ నిర్వహణకు ఆర్థిక సహాయం

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌ల నిర్వహణకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అంది స్తోందని ఎంపీడీఓ సూర్యనారాయణ తెలిపారు. ఎంఈఓలు నాగభూషణం, బాల భాస్కర రావు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కిచెన్ గార్డెన్‌లపై బుధవారం అవగాహన కల్పించారు. ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో కూరగాయలు, ఆకుకూరలను సాగు చేసి, వాటిని మధ్యాహ్నభోజన పథకంలో వినియోగించాలని సూచించా రు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 35 పాఠశాలలకు కిచెన్ గార్డెన్‌ల నిర్వహణ నిమిత్తం ఒక్కో పాఠశాలకు రూ.5 వేలు మంజూరైనట్లు చెప్పారు.

జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవాలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి సెంయింట్ థెరిస్సా అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆటోస్ 2కే–25 జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను అతిథిగా హాజరైన అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ),మెషిన్ లెర్నింగ్, పైతాన్, జావా లాంటి సాంకేతికత కంటే మనిషి మేథస్సు గొప్పదని అన్నారు. విజయనగరం గురజాడ జేఎన్‌టీయూ డీఏపీ కె.చంద్రభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యతపై దృష్టి పెట్టాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.జాషువా జయప్రసాద్,వైస్ ప్రిన్సిపాల్ బి. వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు ఎల్లమ్మ తల్లి సిరిమానోత్సవం

బొండపల్లి: మండల కేంద్రంలో ఎల్లమ్మ తల్లి పండగను పురస్కరించుకుని గురువారం సిరిమానోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు బుధవారం తెలిపారు.ఉదయం పూజారి ఆధ్వర్యంలో సిరిమానును ఊరేగించి, సాయంత్రం సిరిమానోత్సవం నిర్వ హించనున్నట్లు పేర్కొన్నారు.ఎల్లమ్మతల్లి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

10 నుంచి మెరకతల్లి అమ్మవారి జాతర

మెరకముడిదాం: మండల కేంద్రంతో పాటు, సోమలింగాపురం, ఎం.పాలెం గ్రామాల ఇలవేల్పు మెరకతల్లి అమ్మవారి జాతర ఈనెల10,11,12వ తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఏటా మాదిరిగానే మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మూడు గ్రామాల భక్తులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

పీఆర్టీయూ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడం తో పీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీలో బుధవారం సంబరాలు నిర్వహించారు.ఉపాధ్యాయులతో కలిసి రవీంద్రనాయుడు కేక్ కట్ చేశారు. మండల పీఆర్టీయూ సంఘ నాయకులు గంగుపల్లి సత్యనారాయణ, మెండి జగన్నాథం, ఎం.ఎస్.ప్రసాద్, ఎం.వి.భారతి, ఆల్తి వెంకటమ్మ, మురళి, ఎస్.వి.నాయుడు, జానకీరామ్, సూర్యనారాయణ, అప్పలనాయుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

8న మెగా లోక్ అదాలత్

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 8వ తేదీన జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వ హించనున్నట్లు జడ్జి బి.కనకలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీకి వీలైన సివిల్, క్రిమినల్ తదితర కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భూఆధార్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని దత్తి గ్రామంలో భూఆధార్‌పై ఏఓ అను రాధ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. భూఆధార్ ఆవశ్యకత, నమోదు చేసుకునే విధానా న్ని వివరించారు. ఈనెల 10వ తేదీలోగా రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నువ్వు, రాగుల పంటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యలను వివరించారు. ఎరువులు కావాల్సిన రైతులు వీఏఏలను సంప్రదిస్తే సకాలంలో సరఫరా చేయిస్తామని చెప్పారు.

క్రాస్ ప్రోగ్రామ్ ప్రారంభం



క్రాస్ ప్రోగ్రామ్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

మెరకముడిదాం: తాగునీటి బోర్ల మరమ్మతుల కోసం నిర్వహించనున్న సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.భాస్కరరావు బుధ వారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామంలో తాగునీటి బోర్లను పరిశీలించి పాడైన వాటికి మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని ఆదేశించారు.

గోడ మీద పడి వృద్ధురాలి మృతి

చీపురుపల్లి: మండలంలోని మెట్టబడి గ్రామంలో ప్రహరీని లారీ ఢీ కొనడంతో ఆ గోడ తన మీద పడిన సంఘటనలో బైరెడ్డి సూరమ్మ (70) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఓ లారీ జొన్నల లోడింగ్ కోసం మెట్టబడి గ్రామానికి వచ్చింది. లోడింగ్ పూర్తయిన తరువాత లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా రివర్స్ చేయడంతో ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టింది. దీంతో ఆ గోడ కూలిన ప్రదేశంలో ఉన్న వృద్ధురాలు సూరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను 108 వాహనంలో విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు హెచ్‌సీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రీసర్వే సక్రమంగా నిర్వహించాలి



చీపురుపల్లిరూరల్(గరివిడి): గెడ్డపువలస గ్రామ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ శ్రీనివాసమూర్తి

చీపురుపల్లిరూరల్(గరివిడి): భూరీసర్వేను సక్రమంగా నిర్వహించాలని డీఆర్ఓ, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ ఎస్. శ్రీనివాసమూర్తి రెవెన్యూ సిబ్బందికి సూచించారు.గరివిడి మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గెడ్డపువలసలో బుధవారం ప్రారంభించి రీసర్వేను ఆయన పరిశీలించారు. రైతుల సమక్షంలోనే సర్వే చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ సచివాల యాన్ని సందర్శించి రికార్డులు, గ్రామ మ్యాప్‌ను పరిశీలించారు. జేసీ వెంట ఆర్డీఓ సత్యవాణి, తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఏడీ సర్వేయర్ రమణమూర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు కొణిశ కృష్ణంనాయుడు, తదితరులు ఉన్నారు.

సద్వినియోగించుకోండి

వేపాడ: భూరీసర్వేను రైతులు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ రాములమ్మ సూచించారు. రామస్వామిపేటలో రీసర్వేపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే చేయడానికి వచ్చే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. సర్పంచ్ వడ్లమాని శర్మ మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



చీపురుపల్లి: బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) యు.మాణిక్యంనాయుడు అన్నారు. చీపురుపల్లి బాలికోన్నత పాఠశాల, గరివిడి మండలంలోని కాపుశంబాం ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. మరి కొద్దిరోజుల్లో పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని విద్యాలను ఆరా తీశారు. పరీక్షలకు కొద్దిరోజులే సమయం ఉందని, సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో సిద్ధమవ్వాలని సూచించారు. చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ఆయన పరిశీలించారు. అలాగే కాపుశంబాం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. డీఈఓ వెంట చీపురుపల్లి ఎంఈఓలు బూసినాయుడు, విజయ్‌కుమార్ ఉన్నారు.